కల్పిక:

# కుక్క

శ్రీ

కొడవటిగంటి కుటుంబరావు

ఎక్కడెక్కడో తిరిగితిరిగి ఆ కుక్క ఎప్పుడూ మా ఇంటి ముందే పడి ఉంటుంది. మా ఇంటిమీద ఈగవాల నివ్వదు. ఇంటిముందుకు బిచ్చగాణ్ణి చేర నివ్వదు. మా తలవాకిలిబండమీద పడుకుని మా ఇంట్లో వాళ్లెవరన్నా లోపలికి వచ్చినా, బయటికి వెళ్లినా, కళ్లుమాత్రమే పైకెత్తి చూసి తోక రాతిమీద అటూ ఇటూ పొర్లిస్తుంది. దానికి ఏజన్మానా ఇంత అన్నపు కరుడు పెట్టి ఎరగం.

“విశ్వాసమంటే అట్లా ఉండాలి,” అనే వాడు మానాన్న. ప్రతిఫలం కోరకుండా చూపించేదే విశ్వాసమని ఆయన తాత్పర్యం. అటువంటి విశ్వాసం ఉంచినందుకు ఆ కుక్కను చూసి మానాన్న మెచ్చుకునే వాడు.

కాని మాతాతకు ఆకుక్కలో ఏమీ విశేషం కనిపించేదికాదు. “ఏజన్మనో మన సొమ్ముతిని ఉంటుంది. ఈ జన్మలో రుణం తీర్చుకుంటున్నది.” అని ఆయన చెప్పే వాడు.

ఆకుక్క మా ఇంట్లోకి అడుగుపెడితే మా నాన్నా కొట్టేవాడు, మాతాతా కొట్టే వాడు. అందుచేత వాళ్లు చూడనప్పుడు నేను తలవాకిటి దగ్గిర దానితో ఆడుకునేవాణ్ణి. దాని వంటిమీద చెయ్యివేస్తే మొదట్లో బాగుండేది. కాని రాను రాను బాగా ఉండేది కాదు. ఒకసారి నాచేతికి దాని కురుపులుకూడా తగిలాయి. తరవాత దాన్ని ముట్టుకోటం మానేశాను.

నాకు కురుపులు లేస్తే చాలామందులు వేసారు. కుక్కకు కురుపులు లేస్తే ఎవరూ మందు వెయ్యరు. మందు వేస్తే కుక్కకురుపులు కూడా నయమై దాని బొచ్చు మళ్లీ వెనకటిలాగా అవుతుందేమో.

ఒకసారి ఆకుక్క మాకు గొప్పఉపకారం చేసింది. అది వేసంకాలం. అందరం, ఇంటిల్లిపాదీ, బయట పడుకున్నాం. చీకటి రాత్రి. ఒక రాత్రివేళ తలవాకిలి తలుపు దగ్గిర కుక్కగట్టిగా మొరిగి, తలుపును కాళ్లతో గీరసాగింది. మానాన్న లేచాడు. మాతాతా, అందరమూ లేచాం. మేం లేవటం చూసి దొంగవాడు గోడదూకి పారిపోయి నాడు. వాడు గోడ ఎక్కి లోపలికి దూకటం కుక్కచూసిఉండాలి.

ఆకుక్క చేసిన మేలుగురించి మానాన్న ఎంతమందితో చెప్పాడో లెక్కలేదు, “దానికి మేమెన్నడూ పట్టెడన్నంపెట్టి ఎరగం! విశ్వాసమంటే అట్లా ఉండాలి,” అనేవాడు మానాన్న.

వెనకటిలాగే మాతాత, “ఆఁ, ఏజన్మలోనో మనసొత్తు తినివుంటుంది. ఇప్పుడు ఋణం తీర్చుకుంటున్నది.” అని అందుకునేవాడు.

ఏమైనా మానాన్నమాత్రం కొంత చలించాడు. కుక్కను లోపలికి రానివ్వసాగాడు. ఎప్పుడైనా - రెండు మూడు రోజులకోసారి - అన్నం మిగిలితే అందరూ తిన్నతరువాత ఇంత పెట్టించేవాడు.

కాని ఏంలాభం? మానాన్న అనుగ్రహం దానిమీద ఎంత పెరిగిందో మాతాత ఆగ్రహం దానికి రెండింతలు పెరిగింది. పెట్లమీదికి వచ్చికూచుందని ఒకరోజు మాతాత దాన్ని కర్రతీసుకొని చావగొట్టాడు. ఇంకోరోజు వంటయింటివాకిలిదగ్గిరికి వచ్చిందని చావ గొట్టాడు. పైపెచ్చు మానాన్నను చివాట్లు పెట్టాడు.

“వెధవకుక్కకు నువే నేర్పావు. దానికి అన్నమెందుకు వెయ్యాలి? తలవాకిలిదాటి లోపలికి అడుగుపెట్టని దాన్ని లోపలికెందుకు రానివ్వాలి? చూడు ఎట్లా నెత్తినెక్కుతున్నదో!”

మానాన్న నీళు నములుతూ, ఆరోజు కుక్క నిద్రలేపకపోతే దొంగలు ఇల్లుదోచుకునేవాళ్లని బయటపడుకున్నవాళ్లకు ఏమీ తెలిసిఉండేదికాదనీ గొణిగాడు.

మాతాత గాండ్రించాడు. ఈ వెధవకుక్కగాంగా ఇల్లు రక్షించింది లెమ్మన్నాడు. ఈ శని నెత్తిన ఎక్కేకన్న దొంగలుపడి ఇలు దోచుకుపోయినా బాగుండేదన్నాడు.

లోపలికి వచ్చి వరండా మెట్లమీద పడుకున్నందుకే, వంటింటి తలుపుదగ్గిర నిలబడి లోపలికి చూసినందుకే మాతాత కుక్కను చావబాదితే మరోరోజు అది ఇంకా గొప్ప అత్యాచారం చేసింది - ఎక్కణ్ణించో అన్నపు కరుడుతెచ్చుకుని మాతలవాకిలి పక్కగా ప్రహరిగోడదగ్గిర పెట్టుకు తింటున్నది. ఇది మాతాతయ్య కంటపడింది. ఆయనచేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు. అది వంటింట్లోనుంచే అన్నంకరుడు ఎత్తుకొచ్చిందన్నాడు. తలవాకిలి తలుపు మూసి దుడ్డుకర్ర తీసుకొని దానివెంటపడ్డాడు. అది కరుడుమాత్రం నోటకరుచుకొని ఆయన్ను దొడ్డిచుట్టూ త్రిప్పింది. కర్రవిసిరేస్తే తప్పించుకున్నది. చివరకు మానాన్నే తలవాకిలి తలుపు తెరిచి దాన్ని తప్పించుకుపోనిచ్చాడు.

తీరా విచారిస్తే అది వంటింటో అడుగు పెట్టనేలేదు. వంటింటితలుపు భద్రంగా వేసి ఉంది. అన్నంగిన్నె చక్కగా మూతపెట్టి ఉంది.

కాని ఆకుక్క మళ్లా మాకు కనిపించలేదు. మాదొడ్లోకి అడుగుపెట్టలేదు. మాతల వాకిలిదగ్గిర పడుకోలేదు.

అది వెళ్లిపోయిన నెలరోజుల్లోగానే మాఇంట్లో దొంగలు పడ్డారు. మాతాతకోరిక ఫలించింది.

ఎందుకో నాకూ ఆనందమే కలిగింది.


